NEELAGIRI VARTHA TELUGU DAILY

# నీలగిరి వార్త

APTEL/2009/31957 తెలుగు దినపత్రిక మన కోసం మన వార్త

తెలంగాణ ఎడిటర్ : గుంటోజి విష్ణుమూర్తి, శనివారం 28-09-2024 సంపుటి : 15 సంచిక : 94, పేజీలు 12 వెల : 4/-





3 లో..

## మహారాష్ట్ర ప్రభుత్వంతో మేఘా ఒప్పందం




3 లో..

## కేంద్రం అప్పుల వేట



# కొండా లక్ష్మణ్ బాపూజీకి రేవంత్ నివాళి..

హైదరాబాద్ నీలగిరి వార్త ప్రతినిధి

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ కోసం సర్వస్వం ధారపోసిన త్యాగశీలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలు అందించారని స్మరించుకున్నారు.

తెలంగాణ కోసం తపించిన బాపూజీ అడుగుజాడల్లో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆయన సేవలు నిరంతరం గుర్తుండాలన్న లక్ష్యంతోనే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు రేవంత్. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్, మైనంపల్లి రోహిత్, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# ప్రవాసి ప్రజావాణి ప్రత్యేక కౌంటర్ ప్రారంభించిన పొన్నం

- మొదటి అభ్యర్థన స్వీకరించిన మంత్రి పొన్నం
- గల్ఫ్ బాధితుల కోసమే : మంత్రి ప్రభాకర్

తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గల్ఫ్ బాధితుల కోసం ప్రవాసి ప్రజావాణి అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ప్రజావాణి కార్యక్రమం మాదిరిగానే ఈ కార్యక్రమం ప్రతి బుధ, శుక్రవారాలు ప్రభుత్వం నిర్వహించనుంది. గల్ఫ్ బాధితులు తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్రవాసి ప్రజావాణి వేదికగా ఉంటుంది.

వార్త 2లో

## హైడ్రా పేరుతో ప్రభుత్వం

# హైడ్రామా.. ఈటల

అల్వాల్: నీలగిరి వార్త ప్రతినిధి

హైడ్రా పై అల్వాల్ లో బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ పనితీరు తెలుసుకోవడానికి ఆరేళ్ల సమయం పడితే రేవంత్ రెడ్డి పాలన తెలుసుకోవడానికి కేవలం ఆరు నెలల్లోనే తెలిసిపోయిందన్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం హైడ్రామా చేస్తుందన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా లక్షల కోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేస్తానంటూ, స్థానికుల గూడు చెదరగొట్టే కార్యక్రమం ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. అల్వాల్ జొన్న బండలో ఏడు దశాబ్ద కాలాల నుండి, ఉన్న వడ్డెర వర్గానికి చెందిన వారికి నోటీసులు ఇచ్చి ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తుందని, ఈ నోటీసులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, తాను అండగా ఉంటానని అక్కడ ఉన్న వారికి హామీ ఇచ్చారు. శని, ఆదివారాలు, సెలవు దినాలు చూసుకుని నిజాం సర్కార్ కంటే దుర్మార్గంగా కూల్చివేతలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటే, కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల కోసమే ఉంటది, ఇందిరమ్మ ఇల్లు కట్టించామని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ, పేదలు కట్టుకున్న ఇళ్లకు ఎమ్మార్వో లతో నోటీసులు ఇప్పించడం బాధాకరమని ఈటల రాజేందర్ తెలిపారు.





# ఉప ముఖ్యమంత్రి భట్టి ఇంటికే కన్నం

- విదేశీ పర్యటనలో ఉన్న భట్టి
- ఇంటి తాళాలు పగులకొట్టి దోపిడీ
- బంగారం,వెండి,నగదు ఎత్తుకెళ్లిన చోరులు
- పశ్చిమ బెంగాల్లో చిక్కిన దొంగలు
- నిందితుల నుంచి వెండి, బంగారం, నగదు స్వాధీనం
- హైదరాబాద్‌కు నిందితులను తీసుకువస్తున్న పోలీసులు

హైదరాబాద్ నీలగిరి వార్త ప్రతినిధి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో దొంగతనం కలకలం రేపింది. ఇటీవల భట్టి విదేశీ పర్యటనలో ఉన్న క్రమంలో దొంగలు ఆయన ఇంటికి కన్నం వేశారు. తాళం పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు చోరీ చేశారు. దీనిపై భట్టి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు చోరీ చేసిన దొంగలను పశ్చిమ బెంగాల్ లో అరెస్ట్ చేశారు.గత రాత్రి పశ్చిమ బెంగాల్ లోని ఖరగ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ఏడో నంబర్ ప్లాట్‌ఫాంపై జీఆర్పీ పోలీసుల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. తాము దొంగలమని ఒప్పుకున్నారు. నిందితులు బిహార్‌కు చెందిన రోషన్‌కుమార్ మండల్, ఉదయ్‌కుమార్ ఠాకూర్‌గా పోలీసులు గుర్తించారు.వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో దొంగతనం చేసినట్లు తెలిపారని ఖరగ్‌పూర్ జీఆర్పీ ఎస్పీ దేబశ్రీ సన్యాల్ వెల్లడించారు. వారి వద్ద 2.2 లక్షల రూపాయల నగదు, 100 గ్రాముల బంగారు నాణెం, కొంత విదేశీ కరెన్సీ నోట్లు, పెద్ద మొత్తంలో బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు స్వాధీనం చేసుకున్నామని బెంగాల్ పోలీసులు తెలిపారు. ఈ విషయంపై తెలంగాణ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు.



# ఆ హామీ నెరవేర్చే వరకు రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను : హరీశ్ రావు

నంగునూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. రూ.2 లక్షల రుణమాఫీతోపాటు రైతులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. ధర్నాలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ జరిగే వరకు నేను నిద్రపోను, రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను అన్నారు.రైతుబంధు కేసీఆర్ హయంలో నాట్లకు రైతుబంధు అందిస్తే, ఈ ప్రభుత్వం పంట కోతకు వచ్చినా రైతుబంధు ఇవ్వలేదని మాజీ మంత్రి విమర్శించారు.

వార్త 2లో

## ఢిల్లీలో వాయు నాణ్యత..

# సుప్రీంకోర్టు సీరియస్

హైదరాబాద్ :నీలగిరి వార్త ప్రతినిధి

దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత సరిగా లేని అంశంపై ఇవాళ సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. వాయు నాణ్యతను పర్యవేక్షించడానికి, కాలుష్యాన్ని నియంత్రించడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాయు నాణ్యత నిర్వహణ కమీషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఏజీ మాసిలతో కూడిన ధర్మా ఓసనం ఈ తీర్పును ఇచ్చింది. గాలిలోనే మొత్తం కలుషితం ఉన్నదని, ఎన్సీఆర్ రాష్ట్రాలకు చెప్పినట్లు ఎయిర్ క్వాలిటీ ప్యానెల్ పనిచేయడం లేదని జస్టిస్ ఓకా తెలిపారు. కమిటీలు ఏర్పాటు చేసి ఒక్క చర్య కూడా తీసుకోవడం లేదన్నారు. సీఏక్యూఎం పూర్తిగా పనిచేయలేదని చెప్పడం లేదని, కానీ అనుకున్న రీతిలో ఆ ప్యానెల్ పర్ఫార్మ్ చేయలేదని జస్టిస్ ఓకా వెల్లడించారు. శీతాకాల సమయంలో ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో తీవ్ర వాయు కాలుష్యం నమోదు అయ్యే విషయం తెలిసిందే. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల హర్యానా, పంజాబ్ రాష్ట్రాల నుంచి భారీ స్థాయిలో వాయు కాలుష్యం జరుగుతున్నది. మీరు తీసుకున్న చర్యల వల్ల కాలుష్యం తగ్గిందాఅని సీఏక్యూఎం చైర్మెన్ రాజేశ్ వర్మను సుప్రీంకోర్టు అడిగింది.



# సీఎం రిలీఫ్ ఫండ్‌కు రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళం

హైదరాబాద్ నీలగిరి వార్త ప్రతినిధి

వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళాన్ని అం దజేసింది. రూ.20 కోట్ల చెక్కును సీఎంఆర్ఎఫ్‌కు అందజే శారు. శుక్రవారం ఉదయం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి ఎం ఎస్ ప్రసాద్, బోర్డు సభ్యులతో పాటు తెలంగాణ , ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రాల రిలయన్స్ గ్రూప్ మెంటార్ పి వి ఎల్ మాధవరావులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎంను కలిసి ఆయనకు రూ.20 కోట్ల చెక్కును అందజేశారు.



# మూసీ సర్వేను అడ్డుకున్న స్థానికులు.. తీవ్ర ఉద్రిక్తత

హైదరాబాద్: నీలగిరి వార్త ప్రతినిధి

మూసీ ప్రక్షాళనలో భాగంగా పరిపరివాహక ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు సర్వేను వేగవంతం చేశారు. బఫర్ జోన్, మూసీ రివర్ బెడ్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను గుర్తించి మార్కింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చైతన్య పురి వినాయక్ నగర్ లో మూసీ సర్వే కు వచ్చిన అధికారులను స్థానికులు అడ్డగించారు.



# ప్రవాసి ప్రజావాణి ప్రత్యేక కౌంటర్ ప్రారంభించిన పొన్నం

## మొదటి అభ్యర్థన స్వీకరించిన మంత్రి పొన్నం

## గల్ఫ్ బాధితుల కోసమే : మంత్రి ప్రభాకర్

హైదరాబాద్ : నీలగిరి వార్త ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గల్ఫ్ బాధితుల కోసం ప్రవాసి ప్రజావాణి అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ప్రజావాణి కార్యక్రమం మాదిరిగానే ఈ కార్యక్రమం ప్రతి బుధ, శుక్రవారాలు ప్రభుత్వం నిర్వహించనుంది. గల్ఫ్ బాధితులు తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్రవాసి ప్రజావాణి వేదికగా ఉంటుంది.

**మొదటి అభ్యర్థన స్వీకరించిన మంత్రి పొన్నం**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రవాసి ప్రజావాణి మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుతున్నాషేక్ హుస్సేన్ కుటుంబం నుండి మొదటి అభ్యర్థనను మంత్రి పొన్నం ప్రభాకర్ స్వీకరించారు. సమస్యల వినతి కోసం గల్ఫ్ కార్మికులు భారీగా పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా గల్ఫ్ కార్మికులు సమస్యలపై పెద్ద ఎత్తున తరలి వచ్చి ఫిర్యాదు ఇచ్చారు.

**గల్ఫ్ బాధితులను ఆదుకోవడానికే : మంత్రి**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో చెప్పినట్టు నాలుగు అంశాల పై నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రం నుండి గల్ఫ్ దేశాలకు పెద్ద ఎత్తున ఉపాధి నిమిత్తం వెళ్ళారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. గల్ఫ్ ప్రమాదంలో చనిపోయిన వారికి 5 లక్షల ఎక్స్ గ్రేషియ ఇవ్వడానికి ఇప్పటికే జీవో జారీ చేసుకున్నామని చెప్పారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల పిల్లల చదువులకు ఇబ్బందులు లేకుండా గురుకులాల్లో సీట్లు కల్పిస్తున్నామని తెలిపారు. గల్ఫ్ కార్మికుల కోసం ఉత్తర తెలంగాణ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

# ఆ హామీ నెరవేర్చే వరకు రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను : హరీశ్ రావు

నంగునూరు నీలగిరి వార్త ప్రతినిధి

మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. రూ.2 లక్షల రుణమాఫీతోపాటు రైతులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. ధర్నాలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ జరిగే వరకు నేను నిద్రపోను, రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను అన్నారు.రైతుబంధు కేసీఆర్ హయంలో నాట్లకు రైతుబంధు అందిస్తే, ఈ ప్రభుత్వం పంట కోతకు వచ్చినా రైతుబంధు ఇవ్వలేదని మాజీ మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు దొంగరాత్రి కరెంట్ ఇస్తుందని, కానీ కేసీఆర్ కడుపు నిండా 24 గంటల కరెంట్ ఇచ్చిండని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు వచ్చిన 24 గంటల కరెంటు.. ఇప్పుడెందుకు వస్తలేదని ఆయన ప్రశ్నించారు. కరోనా సమయంలోనూ రైతు బంధుకు సమయం ఇచ్చినమన్నారు.రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని, ఈ వానాకాలం ఆయన చెప్పిన రూ.7,500 లేవని, గతంలో ఇచ్చిన రూ.5 వేలు లేవని మండిపడ్డారు. రైతు బంధు ఇవ్వకుండా రైతులను అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. కుంటిసాకులు, అబద్ధాలతో కాలం గడుపుతున్నారని అన్నారు. కేసీఆర్ 11 సార్లు సమయానికి రైతు బంధు ఇచ్చిండని, వడ్లు కొంటే మూడు రోజుల్లో పైసలు వేసిండని చెప్పారు.కేసీఆర్ రైతు విలువ, రైతు భూమి విలువ పెంచిండని, కానీ కాంగ్రెస్ వచ్చినంక రైతు విలువ తగ్గిందని, భూమి విలువ తగ్గిందని హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం కూలిపోయిందంటున్న రేవంత్ రెడ్డి వచ్చి రంగనాయకసాగర్, మాల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ చూడాలని సూచించారు. కాళేశ్వరంలో వంద బాగాలు ఉంటాయని, అందులోని ఒక్క భాగంలో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం పోయిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.కేసీఆర్ వచ్చి కాళేశ్వరం కట్టినంక రైతులు రెండు పంటలు పండిస్తున్నరని చెప్పారు. రెండు లక్షల మాఫీ, వడ్లకు బోనస్ అన్నారని, వచ్చిందా అని మాజీ మంత్రి ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు బోనస్ అని, ఇప్పుడు సన్నాలు అంటున్నారని మండిపడ్డారు.

# లడ్డూ కల్తీలో బాధ్యులు మూల్యం చెల్లించుకోవాల్సిందే

## హిందూమతాన్ని కించపర్చడం సెక్యులరిజమా

## ఎక్స్ వేదికగా నటి ఖుష్బూ పోస్ట్

చెన్నై, నీలగిరి వార్త ప్రతినిధి

దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోన్న లడ్డూ వివాదంపై నటి ఖుష్బూ స్పందించారు. ఎక్స్ వేదికగా ఆమె పోస్ట్ పెట్టారు. బాధ్యులు కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సిందే నన్నారు. 'తిరుమల లడ్డూ గురించి చాలామంది మాట్లాడుకుంటున్నారు. హిందూ మతాన్ని లక్ష్యంగా చేసుకున్నప్పుడు మనల్ని సైలెంట్‌గా ఉండమంటే ఎలా? ఇతర మతాల విషయంలోనూ ఇలానే వ్యవహరిస్తారా? అలాంటి ఆలోచన చేయాలంటేనే చాలామందికి వెన్నులో వణుకు పుడుతుంది. లౌకికవాదం అంటే ప్రతీ మతాన్ని గౌరవించడం. అంతేగానీ పక్షపాతంతో వ్యవహరించొద్దు. నేను హిందూ మతంలో పుట్టకపోయినా.. ఈ మతానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నాను. నాకు అన్ని మతాలు సమానమే. హిందూ మతాన్ని అవమానించొద్దు.. చులకనగా మాట్లాడొద్దు. దాన్ని అగౌరవపరిస్తే సహించొద్దు. తిరుమల లడ్డూలు కల్తీ చేయడమంటే కోట్లాది మంది ప్రజల మనోభావాలు, విశ్వాసాలు దెబ్బతీయడమే. బాధ్యులు కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సిందే. వేంకటేశ్వరస్వామి చూస్తున్నాడు' అని ఖుష్బూ తన



పోస్ట్‌లో పేర్కొన్నారు. తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

# జగన్ తిరుమల రాకుండా అడ్డుకోలేరు

## డిక్లరేషన్ కోరే హక్కు టిటిడికి లేదు

## గతంలో లేని డిక్లరేషన్ ఇప్పుడే ఎందుకు

## జగన్ డిక్లరేషన్ ఇవ్వాల్సిన అసవరం లేదు

## టిటిడి మాజీ ఛైర్మన్ భూమన మండిపాటు

తిరుపతి, నీలగిరి వార్త ప్రతినిధి



జగన్‌ను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. డిక్లరేషన్ అడిగితే ఈ ప్రభుత్వ పతనం ఖాయమనిహెచ్చరించారు. జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోతే దర్శనానికి అనుమతి లేదనే హక్కు టీటీడీకి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా శ్రీవారిని దర్శించుకోవచ్చని సనాతన ధర్మం చెబుతోందని తెలిపారు. అలాంటిది ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పట్టు వస్త్రాలు సమర్పించిన జగన్‌ను డిక్లరేషన్ అడగడం దారుణమని విమర్శించారు. జగన్ డిక్లరేషన్‌పై ఇంత రాద్ధాంతం జరిగినా చంద్రబాబు మాట్లాడటం లేదని భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. డిక్లరేషన్ వెనుక రాజకీయ కుట్ర ఉందని తెలిపారు. ప్రభుత్వం ఎంత నిర్బంధిస్తే అంత పైకి లేస్తామని హెచ్చరిం చారు. చంద్రబాబు పాశవిక విధానాలను వ్యతిరేకిస్తూనే ఉంటామని భూమన తెలిపారు. చంద్రబాబు వెయ్యి నాలుకల ధోరణిని ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. వైఎస్ జగన్ తిరుమల పర్యటన ఆసక్తి రేపుతోన్న వేళ.. టీటీడీ మాజీ ఛైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసలు వైఎస్ జగన్ ను డిక్లరేషన్ అడిగే హక్కు టీటీడీకి లేదన్నారు. ఐదుసార్లు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన వ్యక్తిని ఎలా అడిగుతారు డిక్లరేషన్ అని నిలదీశారు.. టీటీడీ డిక్లరేషన్ అడిగితే ఈ ప్రభుత్వం పతనం ప్రారంభం అయినట్లే అవుతుందన్నారు.. ఇక, సోనియా గాంధీ డిక్లరేషన్ పెట్టలేదు.. దానికి సాక్షం నేనే అన్నారు.. తిరుమలకు నడిచివెళ్లే అడిగే అధికారం కూడా టీటీడీకి లేదన్నారు.. కానీ, వైఎస్ జగన్ కాలినడకన తిరుమల వెళ్తారని ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు.. ఒక భక్తుడిగా వెంకన్న క్షేత్రానికి జగన్ వస్తున్నారు.. దర్శినానికి వస్తుంటే అడుగు అడుగునా ఆటంకం సృష్టిస్తున్నారు.. చంద్రబాబు చెప్పినట్లు పోలీసులు మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులను హౌస్ అరెస్ట్ చేశారు.. నగర వైసీపీ నేతలను, కార్యకర్తలు బెదిరిస్తున్నారు.. భయభ్రాంతులకు గురి చేస్తూ నోటీసులు ఇచ్చారు.. అసలు జగన్ అంటే ఎందుకు చంద్రబాబుకు భయం అని ప్రశ్నించారు.. భగవంతుని పట్ల అంతంతమాత్రమే నమ్మకం ఉన్న సూడో మనుషులు.. జగన్ డిక్లరేషన్ ఇవ్వాలని చేబుతున్నారని భూమన దుయ్యబట్టారు.. హిందూ ధర్మానికి విరుద్ధంగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారు. ఐదు సార్లు సీఎం హోదాలో స్వామివారికి పట్టు వస్త్రాలు జగన్ సమర్పించారని గుర్తుచేశారు.. లడ్డూ ఘటనలో డిఫెన్స్‌లో పడిపోయి ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు.. పూజలు కూడా చేయకుండా ఇంటిలోనే ఉండాలని వైసీపీ నేతలను అడ్డుకుంటున్నారు. వైసీపీ నేతలు పూజలు కూడా చేయకూడదా? ఎందుకు మీకు అంతా భయం..? అని నిలదీశారు.. 40 శాతం ఓట్లు సాధించిన జగన్ వెంటా ఎవరు లేరని చెప్పడానికి కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు.. అది జరగని పని.. వ్యక్తిగత రాజకీయాల్లోకి దేవుడిని తీసుకుని రాకండి. చంద్రబాబు ఒకటి చేబితే.. పవన్ కల్యాణ్ మరొకటి చెబుతాడు.. హైందవ ధర్మాన్ని పవన్ ఒక్కడే కాపాదేవాడిలా మాట్లాడుతున్నాడు అంటూ ఎద్దేవా చేశారు..వైఎస్ జగన్ తిరుమల వస్తుంటే ఇప్పుడు పవన్ కల్యాణ్ సన్నాయి నొక్కులు నోక్కుతున్నాడు.. మేమే హిందువులు అన్నట్లుగా బీజేపీ నేతలు మాట్లాడుతు న్నారని భూమన అన్నారు. సనాతన ధర్మం పై మాకు విశ్వాసం ఉంది? చంద్రబాబు స్వయంగా జగన్ రావాలని ఆహ్వానం పంపాలి. జగన్ ను అడ్డుకుంటే సనాతన ధర్మాన్ని వ్యతిరేకించినట్లే.. దీని వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు.. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిన జగన్ స్వామివారిని దర్శనం చేసుకునే వెళ్తారని స్పష్టం చేశారు.. చంద్రబాబు సైలెంట్ గా ఉండి మిత్ర పక్షాలను, పోలీసులను రెచ్చగొడుతున్నారు. నిన్నటి వరకు లడ్డూతో డైవర్షన్ పాలిటిక్స్ చేశారు.. లడ్డూలో పస తగ్గడంతో ఇప్పుడు డిక్లరేషన్ అంటూ మొదలెట్టారు అంటూ భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు..

# తిరుమలలో సంప్రదాయాలు పాటించాల్సిందే

## హైందవేతరులు డిక్లరేషన్ సమర్పించాల్సిందే

## గత ఐదేళ్లో కొండపై ఎన్నో పాప కార్యాలు నడిచాయి

## సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి

తిరుపతి,నీలగిరి వార్త ప్రతినిధి

తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలంటే ఎవరైనా సంప్రదాయాలు పాటించాలని సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ అన్నారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ఏనాడైనా ఆయన సతీమణిని శ్రీవారి దర్శనానికి తీసుకొచ్చారా? మన ఇంట్లో పూజ చేస్తేనే పక్కన భార్య ఉండేట్లు చూసుకుంటాం. హిందువుల మనోభావాలు, విశ్వాసాలను ఆయన ఏనాడూ గౌరవించలేదని అన్నారు. గతం గతః.. ఇప్పుడు డిక్లరేషన్ ఇవ్వడం ద్వారా ముందుకు సాగాలన్నారు. హిందుత్వానికి కష్టమొచ్చింది.. అందరం ఒక్కటై కాపాడు కోవాలి. తిరుమల క్షేత్ర ప్రాశస్త్యాన్ని వైకాపా ప్రభుత్వం ఎప్పుడూ కాపాడలేదు. గత ఐదేళ్లలో ఎన్నో పాపాలు జరిగాయి.. ప్రక్షాళన జరగాల్సిందే. ఏనాడైనా డిక్లరేషన్‌పై జగన్ సంతకం చేశారా? ఆలయాలు, పూజారులపై దాడులు జరిగినా ఏనాడూ స్పందించలేదు. ఐదేళ్లలో అనేక అఘాయిత్యాలు జరిగాయి. భయానక వాతావరణం సృష్టించారు. ఇలాంటి వాళ్లు తిరుమల క్షేత్రానికి వస్తున్నారంటే జాగ్రత్తగా ఉండాల్సిందే. సనాతన పరిరక్షణ బోర్డు ఏర్పాటు కావాలి. దీనికి రాజకీయ పక్షాలన్నీ సహకరించాలి. జగన్, వైకాపాపై మాకు వ్యక్తిగత ద్వేషం లేదు. ఆలయాల సంప్రదాయాలను గౌరవించకపోవడాన్ని తప్పు పడుతున్నాం. డిక్లరేషన్ ఇచ్చేందుకు అభ్యంతరమేంటని ప్రశ్నించారు. తిరుమల పర్యటనలో కోడికత్తి నాటకాలాడతారని అనుమానాలున్నాయి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తారనే అనుమానం కలుగుతోంది. గత ఐదేళ్లలో తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చారు. తమ కుటుంబ సభ్యులను పాలకమండలిలో నియమించుకుని అక్రమాలు చేశారు. తిరుమలను శాంతియాగం, ప్రోక్షణతో పవిత్రం చేశారు. జగన్ పర్యటనతో మళ్లీ అపవిత్రమవుతుంది. ఇక్కడికి వచ్చి మరింత క్షోభకు గురిచేయవద్ద అని శ్రీనివాసానంద సరస్వతి వ్యాఖ్యానించారు. ఇకపోతే టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలపై స్వామిజీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోతే దర్శనానికి అనుమతి లేదని చెప్పే హక్కు లేదని భూమన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. డిక్లరేషన్ ఇవ్వకపోతే అలిపిరి వద్ద జగన్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. తిరుపతిలో సేవ్ తిరుమల.. సేవ్ టీటీడీ సమావేశం శుక్రవారం నాడు జరిగింది. ఈ సందర్భంగా సనాతన ధర్మ పరిరక్షణ బోర్డుకు స్వామిజీలు డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో తిరుమల పవిత్రతను కాపాడలేదని విమర్శించారు. తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలంటే ఎవరైనా సంప్రదాయాలు పాటించాలని సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ అన్నారు. జగన్ ఏనాడైనా ఆయన సతీమణిని శ్రీవారి దర్శనానికి తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. మన ఇంట్లో పూజ చేస్తేనే పక్కన భార్య ఉండేట్లు చూసుకుంటామని అన్నారు. హిందువుల మనోభావాలు, విశ్వాసాలను జగన్ ఏనాడూ గౌరవించలేదని విమర్శించారు.

# ఉద్రిక్తంగా మూసీ ప్రక్షాళన

## సర్వేను అడ్డుకున్న నిర్వాసితులు

## పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం

## ఏళ్లుగా ఇక్కడే స్థలాలు కొనుక్కుని ఉంటున్నామని వెల్లడి

## రజాఏందర నగర్ వద్ద రోడ్డెక్కి ధర్నాకు దిగడంతో ట్రాఫిక్ జామ్

హైదరాబాద్, నీలగిరి వార్త ప్రతినిధి

గ్రేటర్ హైదరాబాద్‌లో ఆపరేషన్ మూసీ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. మూసీ సుందరీకరణలో భాగంగా నదీ గర్భంతోపాటు పరివాహక ప్రాంతంలో కట్టుకున్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలను తొలగించి వారికి ప్రత్యామ్నాయం చూపించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీంతో మహానగరంలో ఎక్కడ చూసినా మూసీ ప్రక్షాళన అంశం హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఏళ్ల తరబడి నివాసముంటున్న తమను నివాసాల నుంచి వెళ్లగొడుతుండడంతో నిర్వాసితులు ఆందోళనకు గురవుతున్నారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా పరిపరివాహక ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు సర్వేను వేగవంతం చేశారు. బఫర్ జోన్,మూసీ రివర్ బెడ్ పరిధిలోని ఆక్రమ నిర్మాణాలను గుర్తించి మార్కింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చైతన్యపురి వినాయక్‌లో మూసీ సర్వేకు వచ్చిన అధికారులను స్థానికులు అడ్డగించారు. మా ఇండ్లు కూల్చొద్దు.మాకు అన్ని రకాల రిజిస్ట్రేషన్ ఉన్నాయి. కరెంట్, వాటర్ సప్లయ్ ఉన్నాయి.ఇప్పుడు ఎందుకు వచ్చారు అంటూ అధికారులను స్థానికులు, కార్పొరేటర్లు నిలదీశారు. ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు రాజేంద్రనగర్ తహసీల్దార్ సిబ్బందిని, రెవెన్యూ, మున్సిపల్, ఎలక్ట్రికల్ అధికారులను సర్వే వద్దు వెళ్లి పోండంటూ మహిళలు అడ్డుకున్నారు. లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో రింగ్ రోడ్డుకు అడ్డంగా కూర్చుని డిఫెన్స్ కాలనీ వాసులు నిరసనకు దిగారు. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయ్యింది. తమకు అన్యాయం చేస్తున్నారని స్థానికులు నినాదాలు చేశారు. మూసీనది లోపల, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు మొదటి విడతలో నదీ గర్భంలోపల కట్టుకున్న ఇళ్లు, నిర్మాణాలను తొలగించేందుకు రెవెన్యూ, మూసీ అధికారులు ముందుకుసాగుతున్నారు. గురువారం లంగర్‌హౌజ్‌లోని ఆశ్రంనగర్, గోల్కొండ, ఇబ్రహీంబాగ్, కిషన్‌బాగ్, శంకర్‌నగర్, మూసారాంబాగ్, చాదర్‌ఘాట్, చైతన్యపురి, తదితర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ మేరకు నిర్వాసితుల నుంచి ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు, నల్లా బిల్లులను సేకరించారు. ఇదే సమయంలో ప్రతి ఇంటిగోడకు ఆర్‌బీ–ఎక్స్ అంటే రివర్‌బెడ్‌లో ఇల్లు ఉందని సూచిస్తూ ముద్రవేశారు. నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తామని భరోసా కల్పించాలని సూచించింది. కాగా, గతంలో చేపట్టిన సర్వే ప్రకారం.. మూసీ పరివాహకం 55 కిలోమీటర్ల పరిధిలో దాదాపు 12,184పైగా అక్రమ కట్టడాలున్నట్లు రెవెన్యూ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ అధికారులు తేల్చారు. నదీగర్భంలో 1,595 నిర్మాణాలను గుర్తించారు. ఇందులో 288 భారీ నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. అలాగే నది సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్ల వరకు ఉన్న నిర్మాణాలను బఫర్‌జోన్ కింద గుర్తించారు. ఇందులో మొత్తం 7,851 అక్రమ నిర్మాణాలు, 1,032 భారీ నిర్మాణాలున్నట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా, ఎఫ్‌టీఎల్ పరిధిలో 3,004 అక్రమ కట్టడాలున్నట్లు తేల్చారు. నదీగర్భంలో ఇళ్లు కట్టుకున్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తున్న మాదిరిగానే.. బఫర్‌జోన్‌లోని ప్రభుత్వ స్థలంలో ఉన్న నిర్వాసితులకు కూడా రెండు పడకల ఇంటిని ఇవ్వనున్నారు. బఫర్‌జోన్‌లోని ప్రైవేట్ స్థలాల్లో చేపట్టిన భారీ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు మాత్రం 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారంతోపాటు ఇంటి వ్యయాన్ని చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.ప్రధానంగా చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో కొనుగోలు చేసిన వారు హైరానా పడుతున్నారు. ఇదిలా ఉండగా, నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్ల బఫర్‌జోన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో ఇళ్లు, భారీ నిర్మాణాలు చేపట్టిన వారు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా రూ. లక్షలు, కోట్లు వెచ్చించి అపార్ట్‌మెంట్లు కొనుగోలు చేసిన ఉద్యోగులు, ఇతరులు ఆందోళన చెందుతున్నారు. ఏ సమయంలో తమను ఇక్కడి నుంచి పంపిస్తారోనని టెన్షన్‌కు లోనవుతున్నారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా గండిపేట మండలంలో అధికారుల బృందం సర్వే చేపట్టింది.

NEELAGIRI VARTHA TELUGU DAILY నీలగిరి వార్త తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# ఖనిజ సంపద ప్రజలదే!



కొన్ని రాష్ట్రాలలో అపారమైన ఖనిజ సంపద వుంది. అయినప్పటికీ ఆ ప్రాంతంలోని సామాన్య ప్రజలు కడు పేదరికంలో జీవిస్తున్నారు. ఖనిజ సంపద నుంచి వచ్చే ఆదాయం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు, దేశ విదేశాల్లో వున్న పెద్ద కంపెనీలకు చేరుతున్నది. ఒరిస్సాలో ఇనుప ఖనిజాలు ఉన్నాయి. చత్తీస్‌గఢ్‌లో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి. కేరళలో థోరియం లభిస్తుంది. ఈ ఖనిజాలను ముడి పదార్థాలుగా జపాన్, చైనా లాంటి దేశాలు ఉపయోగించి తమ సంపదను పెంచుకుంటున్నాయి. ఆంధ్ర లోని గ్యాస్, చమురు నిక్షేపాలు రిలయన్స్ లాంటి కంపెనీలకు లాభాలను ఇస్తున్నాయి. ఈ ఖనిజ సంపద ఉన్నందు వలన స్థానిక ప్రజలకు ఉపయోగం ఏమీ లేకపోగా ఈ ఖనిజాలను వెలికి తీసినందువలన అనేక దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ వత్తాసు వున్న బడా కంపెనీలు, దళారీలు ప్రజల కళ్ళలో దుమ్ము కొట్టి లాభాలు గుంజుకుంటున్నారు. ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. చదువు ఖరీదైంది. నిరుద్యోగం ఎక్కువవటం వలన యువత దారి తప్పుతున్నారు. పైగా ఖనిజ సంపదను కాపాడుతున్న ఆదివాసీలపై దాడుల ఉధృతి మరింత పెరుగుతోంది. పేదరికంలో ఉన్న ఆ రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపదపై పన్ను విధించడానికి హక్కు లేదన్నారు. అందుకనువైన చట్టాలను చేసుకుంటున్నారు. రాజ్యాంగం లోని ఫెడరల్ స్ఫూర్తిని పక్కన పెట్టారు. రాష్ట్రాలపై పెత్తనం చేస్తూ ఆర్థిక వనరులన్నీ కేంద్ర ప్రభుత్వం చేతిలోకి తీసుకొని బడా కంపెనీలకు ఊడిగం చేస్తూ ప్రజలను పేదరికంలోనే వుంచుతున్నారు. అదేమన్న వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారు. పాలక వర్గాలకు అనుకూలమైన చట్టాలను చేసుకుంటున్నారు.

### పాలక వర్గ అనుకూల చట్టాలు

1) రాజ్యాంగంలోని 246 ఆర్టికల్‌ను ఉపయోగించి 1957లో మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ (ఎం.ఎం.డి.ఆర్) చట్టాన్ని చేశారు. ఈ చట్టం కింద సెక్షన్9 ద్వారా సంక్రమించిన అధికారాలను అడ్డు పెట్టుకుని, రాయల్టీని కేంద్ర ప్రభుత్వానికే చెల్లించాలన్నారు. ఫలితంగా ఖనిజ సంపద వున్న ప్రజలను, ప్రాంతాలను నిత్య పేదరికంలో వుంచారు. పాలక వర్గం, దళారీలు, దేశ విదేశీ కంపెనీలు లాభపడ్డాయి.

2) లైమ్‌స్టోన్ ఖనిజాన్ని వెలికి తీస్తున్న ఇండియా సిమెంట్స్‌పై తమిళనాడు ప్రభుత్వం%ా% రాజ్యాంగం 7వ షెడ్యూల్ లోని రాష్ట్ర జాబితాలోని 49, 50 ఎంట్రీల ప్రకారం భూమి పన్ను విధించింది. 1957లో చేసిన ఎం.ఎం.డి.ఆర్ చట్టాన్ని అడ్డం పెట్టుకుని రాయల్టీపై సెస్, పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని ఏడుగురు సభ్యులున్న సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. రాయల్టీ అంటే పన్ను అన్నారు (ఇండియా సిమెంట్స్ వర్సెస్ తమిళనాడు గవర్నమెంట్ కేసు).

3) మరొక ప్రఖ్యాత కేసులో రాజ్యాంగ బెంచ్ పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు వుందన్నారు. రాయల్టీ అంటే పన్ను కాదన్నారు. అంతకు ముందు వున్న తీర్పులన్నిటికీ భిన్నమైన తీర్పు ఇచ్చారు. కేశోరామ్ ఇండస్ట్రీస్ వర్సెస్ వెస్ట్ బెంగాల్ రాష్ట్రం మధ్య నడిచిన కేసులో, రాజ్యాంగ బెంచ్ అందుకు విరుద్ధమైన తీర్పు ఇచ్చింది.

### చారిత్రాత్మక తీర్పు

జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం 2024 సంవత్సరం జులై 25న ఒక చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్రాల అధికారాన్ని, ఫెడరలిజం స్ఫూర్తిని నిలబెట్టేదిగా ఉన్నది. ఖనిజాలను వెలికి తీసే భూమిపై పన్నులు, సెస్ వంటి లెవీలు విధించే అధికారం రాష్ట్రాలకే ఉందని, కేంద్రానికి ఆ హక్కు లేదని 8–1 మెజార్టీతో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో 1999 నుండి ఉన్న సివిల్ ఆప్పీల్ నెంబర్లు 4056%ా%4064 నుండి ఇప్పటి వరకు వున్న అతి పురాతనమైన కేసులన్నీ పరిష్కరింపబడ్డాయి.

### తీర్పులో ముఖ్యమైన అంశాలు

ఖనిజ హక్కులపై పన్ను విధించే శాసనాధికారం రాష్ట్ర శాసనసభలకు ఉంటుంది. కేంద్ర జాబితాలోని ఎంట్రీ 54 కింద ఖనిజ హక్కులపై పన్ను విధించే శాసనపరమైన సామర్థ్యం పార్లమెంటుకు లేదు. ఇది జనరల్ ఎంట్రీ. మినరల్ హక్కులపై పన్ను విధించే అధికారం రాష్ట్ర జాబితా2 లోని ఎంట్రీ 50లో పేర్కొనబడినందున, ఆ విషయానికి సంబంధించి పార్లమెంటు తన విశేష అధికారాలను ఉపయోగించజాలదు.

గనులు, క్వారీలతో కూడిన భూములపై పన్ను విధించేందుకు రాష్ట్ర జాబితా2 లోని ఎంట్రీ 49తో పాటు ఆర్టికల్ 246 ప్రకారం రాష్ట్ర శాసనసభలు శాసన సామర్థ్యాలను కలిగి ఉంటాయి. లిస్ట్ 2 లోని ఎంట్రీ 50కి సంబంధించి ఖనిజాభివద్ధికి సంబంధించిన చట్టంలో పార్లమెంటు విధించిన 'పరిమితులు' లిస్ట్ లోని ఎంట్రీ 49పై పని చేయవు. ఎందుకంటే రాజ్యాంగం ప్రకారం ఆ ప్రభావానికి ఎటువంటి నిర్దిష్ట నిబంధన లేదు.

అయితే కోర్టు విచారణలో ఆయిల్ ఫీల్డ్స్, మినరల్ ఆయిల్ రిసోర్సెస్, పెట్రోల్, పెట్రోలియం ఉత్పత్తుల గురించి లేకపోవడం విచారకరం.

# మహారాష్ట్ర ప్రభుత్వంతో మేఘా ఒప్పందం

## రెండు జల విద్యుత్ కేంద్రాల నిర్మాణం




**హైదరాబాద్ :**

మహారాష్ట్రలో 21 వేల కోట్ల పెట్టుబడితో 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) ఒప్పందం కుదర్చుకుంది. ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో గురువారం జరిగిన ఒప్పంద కార్యక్రమంలో అక్కడి జల వనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి దీపక్ కపూర్, మేఘా సంస్థ తరపున కంపెనీ ప్రెసిడెంట్ ఆర్‌విఆర్ కిషోర్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ మాట్లాడుతూ నీటి వినియోగం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అన్నారు. కామోడ్ వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌ను ఐదేళ్ళలో, ఘోస్లా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌ను మూడున్నరేళ్లలో అందుబాటులోకి తేనున్నామన్నారు.

# హోమ్‌లేన్ చేతికి డిజైన్ కేఫ్

**న్యూఢిల్లీ :**

ఇంటీరియర్ డెకర్ సొల్యూషన్స్ సంస్థ హోమ్‌లేన్ తన పోటీ సంస్థ డిజైన్ కేఫ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. అదే విధంగా ఇన్వెస్టర్ల నుంచి కొత్తగా 30 మిలియన్ డాలర్లు (రూ.250 కోట్లు) నిధులు సమీకరించినట్లు హోమ్‌లేన్ తెలిపింది. ఈ నిధులను హీరో ఎంటర్‌ప్రైస్, వెస్ట్‌బ్రిడ్జ్ కాపిటల్ నుంచి పొందినట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ రెండు సంస్థల రెవెన్యూ 108 మిలియన్ డాలర్లు (రూ.900 కోట్లు)గా ఉందని అంచనా వేసింది.



# పెరుగుతున్న క్రెడిట్ కార్డు డిఫాల్టర్లు

## రూ.2.6 లక్షల కోట్లకు బకాయిలు

## తిరిగి చెల్లించడంలో యువత విఫలం

**న్యూఢిల్లీ :**

ఇటీవల క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగిపోయింది. ఇదే క్రమంలో బకాయిలు చెల్లించలేక క్రమంగా డిఫాల్టర్లు పెరిగిపోతున్నారు. ఇది రుణగ్రహీతల బలహీన ఆర్థిక పరిస్థితులకు అద్దం పడుతోంది. ట్రాన్స్‌యూనియన్ సిబిల్ డాటా ప్రకారం.. 2023 మార్చి ముగింపు నాటికి 1.6 శాతంగా ఉన్న డిఫాల్టర్లు.. 2024 జూన్ నాటికి 1.8 శాతానికి పెరిగారు. మరోవైపు బకాయిల విలవ భారీగా పెరిగిపోతోంది. 2024 మార్చి ముగింపు నాటికి క్రెడిట్ కార్డు బకాయిలు ఏకంగా రూ.2.6 లక్షల కోట్లకు ఎగిశాయి. ఇంతక్రితం ఏడాది మార్చి నాటికి ఈ విలువ రూ.2 లక్షల కోట్లుగా నమోదయ్యింది. కరోనాకు ముందు 2019 మార్చి నాటికి బకాయిలు రూ.87,686 కోట్లుగా ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో ప్రతీ ఏడాది సగటున 24 శాతం చొప్పున పెరుగుతూ రావడం ఆందోళనకర అంశం."యువ మిలీనియల్స్ క్రెడిట్ కార్డు మొత్తం పరిమితిని ఉపయోగిస్తున్నారు. అనంతరం నేరుగా డిఫాల్ట్ చేస్తున్నారు. రుణాన్ని కూడా తిప్పికొట్టకుండా డిపాల్టర్లుగా మారుతున్నారు." మాక్వారీ పరిశోధన విశ్లేషకుడు సురేష్ గణపతి పేర్కొన్నారు. క్రెడిట్ కార్డులలో నికర నష్టాలు 5–6 శాతానికి దగ్గరగా ఉన్నాయన్నారు. గడిచిన త్రైమాసికంలో ఎస్‌బిఐ కార్డు 7.5 శాతం నికర క్రెడిట్ లాస్ (ఎన్‌సిఎల్)ను చవి చూసిందన్నారు."రుణగ్రహీత వాయిదాలలో తిరిగి చెల్లిస్తారనే ఆలోచనతో తొలుత పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేయడంతో డిఫాల్ట్ ప్రారంభమవుతుంది. కానీ ఈ బాకీపై కొన్ని సార్లు సంవత్సరానికి 48 శాతం వరకు వడ్డీనీ చెల్లించాల్సి వస్తుంది. కనీస మొత్తాన్ని చెల్లించే వరకు రుణగ్రహీత పరిస్థితి దిగజారుతుంది. ఆ తర్వాత డిఫాల్ట్ అవుతున్నారు." అని డెట్ రిలీఫ్ వేదిక ఫ్రీడ్ సిఇఒ రితేష్ శ్రీవాస్తవా పేర్కొన్నారు.

### కొత్తగా 9.2 లక్షల కార్డుల జారీ..

ఈ ఏడాది ఆగస్టులో కొత్తగా 9.2 లక్షలకు పైగా క్రెడిట్ కార్డులు జారీ అయ్యాయని ఆర్‌బిఐ వెల్లడించింది. ఇంతక్రితం జులైలో 7.55 లక్షల కార్డులను అందించాయి. మొత్తం క్రెడిట్ కార్డుల సంఖ్య 10.55 కోట్లకు చేరాయి. ఈ కార్డుల జారీలో ప్రతీ ఏడాది సగటున 15.6 శాతం పెరుగుదల నమోదవుతోంది. గడిచిన ఆగస్టు నెలలో హెచ్‌డిఎఫ్‌సి అత్యధికంగా 2.41 లక్షల కార్డులను జారీ చేసింది. ఐసిఐసిఐ బ్యాంక్ 1.45 లక్షలు, యాక్సిస్ బ్యాంక్ 1.27 లక్షలు, ఎస్‌బిఐ కార్డ్స్ 1.1 లక్షల చొప్పున కొత్త క్రెడిట్ కార్డులను జారీ చేశాయి.




NEELAGIRI VARTHA TELUGU DAILY నీలగిరి వార్త తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# కేంద్రం అప్పుల వేట

## వచ్చే ఆరు నెలల్లో రూ.6.61 లక్షల కోట్లు లక్ష్యం

## సెక్యూరిటీల జారీతో సమీకరణ

**న్యూఢిల్లీ :**

అప్పుల సమీకరణపై మోడీ సర్కార్ దృష్టి పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి మార్చి కాలం ద్వితీయార్థం (హెచ్2)లో రూ.6.31 లక్షల కోట్ల రుణాలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సెక్యూరిటీలను జారీ చేయడం ద్వారా అప్పులను పొందాలని నిర్దేశించుకుంది. దీంతో రెవెన్యూ లోటును పూడ్చుకోనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. "2024–25 బడ్జెట్‌లో రూ.14.01 లక్షల కోట్ల అప్పులను తీసుకోవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 47.2 శాతానికి సమానమయ్యే రూ.6.61 లక్షల కోట్లను ద్వితీయార్థంలో మార్కెట్ల నుంచి పొందాలని నిర్దేశించుకుంది. ఇందుకోసం డేటెడ్ సెక్యూరిటీలను జారీ చేయడంతో పాటుగా సావరిన్ గ్రీన్ బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.20,000 కోట్ల అప్పులను తీసుకోవాలని నిర్ణయించాం." అని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ అప్పులను 21 వారాల్లో వేలం ద్వారా పొందనున్నట్లు తెలిపింది. ఇందుకోసం 3,5,7,10,15,30,40,50 సంవత్సరాల కాలపరిమితి కలిగిన సెక్యూరిటీలను జారీ చేయనుంది. రూ.14.13 లక్షల కోట్ల రుణం తీసుకోనున్నట్లు 2024–25 మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.15.43 లక్షల కోట్ల అప్పులను సమీకరించారు.



## ఎస్సై కుమారుడి బెదిరింపులకు యువకుడు బలి..





**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి అనిల్ భగత్ :**

ఎస్సై కుమారుడి బెదిరింపులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూసింది. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని భగత్ సింగ్ నగర్ కు చెందిన కేకే5 గని కార్మికుడు దాసరి నారాయణ సరోజ దంపతుల కుమారుడు రాజేష్ 32 హైదరాబాద్ లోని కూకట్ పల్లి నిజాం చెరువులో దూకి బుధవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కుమారుడు బొంతుల వినయ్, కొత్తపల్లి శ్రీనివాస్ లు బెదిరింపులతో ఆత్మహత్య చేసుకోవడం జరుగుతోందని సెల్ఫీ వీడియో తీసుకొని భార్య కుశు మలకు, పలువురు స్నేహితులకు మృతుడు రాజేష్ బుధవారం సాయంత్రం పంపించారు. మృతుడి భార్య ఫిర్యాదుతో మొబైల్ లొకేషన్ ఆధారంగా రెండు రోజుల పాటు గాలింపు చేపట్టాగా శుక్రవారం ఉదయం రాజేష్ మృతదేహాన్ని గుర్తించారు హైదరాబాద్ పోలీసులు. మృతుడి మామా గాదె రవి మాట్లాడుతూ ఎస్సై కుమారుడు బొంతుల వినయ్, కొత్తపల్లి శ్రీనివాస్ ల అక్రమ వడ్డీ వ్యాపారం, ఉద్యోగుల పేరుతో మోసాలు చేస్తూ మితిమీరిన బెదిరింపులకు పాల్పడి రాజేష్ దంపతులకు చెందిన పెద్దపల్లి ప్రాంతంలోని భూమిని లాక్కున్నారాని ఏమి చేయలేక నిస్సహాయతతో బలవన్మరణానికి రాజేష్ పలుపడినట్లు తెలిపారు. వినయ్, శ్రీనివాస్ లకు గత నెలలో ముప్పై ఐదు లక్షల రూపాయలను రాజేష్ చలించినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తూ విలపిస్తున్నా ఘటన బస్తి ప్రజలను కన్నీరు పెట్టించింది.

## విద్యార్థులతో ప్రముఖ మానసిక వైద్యుడు సునీల్..




**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి అనిల్ భగత్ :**

మంచిర్యాల జిల్లాలోని కాసిపెట్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో శుక్రవారం టేలి మానస్ కార్యక్రమాని మానసిక వైద్యనిపుణులు సునీల్ కుమార్ నిర్వహించారు. మెంటల్ హెల్త్ అవేర్నెస్ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎన్.శంకర్ అద్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డా సునిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించడానికి ముందుకు వెళ్లే మార్గాన్ని నిర్దేశించారు. ప్రతినిత్యం లక్ష్యాలను చేరుకోవడానికి వాటికి సంబందించిన పుస్తకాలు, సేకరించుకొని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. విద్యార్థి దశలో ప్రవర్తనలో మార్పు, ఆలోచన విదానంలో మార్పు ఉండాలని సూచించారు. మంచి కళలను అభిరుచులను, లక్ష్మాలను ఏర్పరచుకోవాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ మానసిక వైద్య నిపుణులు చెప్పిన అంశాలు దృష్టిలో ఉంచుకొని తప్పకుండా వాటిని పాటిస్తే ఏదైనా సాధించగలరని విద్యార్థులకు తెలియజేశారు.



# అసంఘటిత కార్మిక శక్తి..


ఒక ఉద్యమం పుట్టింది. అది మధ్యప్రదేశ్ లోని ఛత్తీస్ ఘడ్ ప్రాంతాన్నే కాదు దేశ కార్మిక, శ్రామిక, రైతాంగ లోకాన్ని ఆలోచింపజేస్తూ పేద ప్రజలకు పెద్దదిక్కుగా నిలిపి నేటికీ అనేక ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచింది. ఛత్తీస్ గఢ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడక ముందు నాటి మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని ఏడు జిల్లాలు రాయ్ పూర్, దుర్గ్, రాజ్ నంద్ గావ్, సర్గుజా, బిలాస్ పూర్, రాయ్ గఢ్, బస్తర్ ప్రాంతాలు ఇనుప ఖనిజం, బొగ్గు, సున్నపురాయి, డోలమైట్, అనేక ఇతర నిక్షేపాలకు ప్రసిద్ధిగా పేరుగాంచాయి. 1959 నెహ్రూ ప్రభుత్వం దుర్గ్ జిల్లాలోని భిలాయ్ లో సోవియట్ యూనియన్ సహకారంతో ప్రభుత్వ రంగంలో భిలాయ్ స్టీల్ ఫ్యాక్టరీని నెలకొల్పింది. ఆ ఫ్యాక్టరీ దేశంలోనే ఉక్కు ఉత్పత్తిలో అతిపెద్ద కర్మా గారంగా రూపాంతరం చెందింది.పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ సమీపంలోని జూల్పు యిగురిలో 1942 సెప్టెంబర్ 18న జన్మించిన శంకర్ గుహ నియోగి వారి కుటుంబంలో పెద్దవాడు. తండ్రి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. నియోగి పంతొమ్మిది సంవత్సరాల వయసులోనే బంధువుల ఇంటికి వచ్చి భిలాయ్ స్టీల్ ఫ్యాక్టరీలో ఉద్యోగం పొంది బ్లాస్ట్ అండ్ ఫర్నేన్స్ యాక్షన్ కమిటీ అనే కార్మిక సంఘాన్ని స్థాపించి సమరశీలమైన పోరాటాలు సమ్మెలు చేయడం ప్రారంభించారు.

## కార్మికులకు ఏకం చేసి..

అధిక వెట్టిచాకిరి, చాలీచాలని జీతాల నడుమ చిన్నాభిన్నం అయి బ్రతుకీడుస్తున్న కార్మికులందరి చేత మద్యపానానికి వ్యతిరేకంగా నియోగి ప్రమాణం చేయించడంతో అక్కడ సంపూర్ణ మద్య నిషేధం జరిగింది. ముఖ్యమంత్రి అర్జున్ సింగ్ హయాంలో పారిశ్రామిక ప్రాంతంలో మద్య నిషేధం అమలవడంతో ప్రభుత్వానికి కంటగింపుగా నియోగి మారారు. ఇదే క్రమంలో ఛత్తీస్ గఢ్ ముక్తి మార్చ్ ఉద్యమం ప్రారంభం కావడం అది ధవణంలా వ్యాపించడం జరిగిపోయింది. సంఘటిత అసంఘటిత కార్మికుల నడుమ ఉన్న అంతులేని అంతర్యాలు అర్థం చేసుకొని వారందరినీ ఒకటిగా చేయడం మొదలు కార్మికులు సమ్మె చేసే క్రమంలో జీతభత్యాలు లేక కార్మిక కుటుంబాలు ఆకలితో అలమటించవద్దని సమీప గ్రామాల రైతుల నుండి కార్మికుల కుటుంబాలకు కాయకురగాయలు, బియ్యం, అందించడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. తిండి గింజలకు కొదవ లేని కార్మికుల తమ పోరాటం నిర్విరామంగా కొనసాగించడం గొప్ప చరిత్ర. ఎమర్జెన్సీ కాలంలో అరెస్ట్ అయి 13 నెలలు జైలు జీవితం అనుభవించిన ఆయన తన జీవితంలో 26 సార్లకు పైగా జైల్లో ఉన్నారు. ఆంగ్లేయుల గుండెల్లో గుబులు పుట్టించిన షాహిద్ వీర్ నారాయణ సింగ్ పేరుతో పాటుగా, తమ హక్కుల కోసం జరిగిన పోరాటంలో పోలీస్ కాల్పుల్లో అమరులైన అమాయకులైన ఆదివాసీ కార్మికులు, బాల నాట్య కళాకారుల పేరిట రోగిని ప్రేమించి రూపాయిని ద్వేషించి షాహీద్ ఆసుపత్రిని నిర్మించి ప్రజలందరికీ ఉచిత సేవలు అందించారు. అది ఇప్పటికి వైద్యులు సైబల్ నేతృత్వంలో స్వచ్ఛందంగా సేవలందించడం విశేషం. ధనిక భూస్వామి, కాదు పేద ప్రజలకు నిలయమైన ఛత్తీస్గఢ్ లో ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలపై స్వార్థ ప్రయోజనాలే ఆధిపత్యం కొనసాగాయి. ఈ ప్రాంతంలోని సహజ వనరులను దోపిడీ చేయడంలో పారిశ్రామికవేత్తలది పైచేయి కాగా సాధారణ ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలకు అంకురార్పణ చేసిన నియోగిపై జాతీయ భద్రతా చట్టం కింద కేసులు నమోదు చేశారు.

## వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు.

కార్మికులను దోచుకున్న పారిశ్రామిక వేత్తలను ఎదిరించి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందు వరుసలో నిలిచి అనేక కేసులు, జైలు జీవితం గడిపారు. చివరకు తనను హత్య చేయచూస్తున్నారని రాష్ట్రపతికి నేరుగా నియోగి ఫిర్యాదు చేసిన స్థానిక అధికార యంత్రాంగం ఎటువంటి రక్షణ కల్పించలేదు. దీంతో 1991 సెప్టెంబర్ 28న తన ఇంట్లో నిద్రిస్తున్న నియోగిని కిరాయి హంతకుడు ప్లాటిన్ కాల్చి చంపించారు. ఇది దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఆ హత్య కేసును కార్మికుల డిమాండ్లతో కేంద్రం సీబీఐకి అప్పగించడంతో సెషన్స్ కోర్టు 1997లో ఐదుగురికి యావజ్జీవ కారాగార శిక్ష, కిరాయి హంతకుడికి మరణ శిక్ష ఖరారు చేయగా నిందితులు క్రింద కోర్ట్ తీర్పును సవాల్ చేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. 1998 కోర్టు నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేసింది. దీంతో ఆ తీర్పు మీద అసంతృప్తి వ్యక్తం చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు తీర్పుతో ఏకీభవిస్తూ కిరాయి హంతకుడికి ప్లాటిన్ కు మరణ శిక్షకు బదులుగా యావజ్జీవ కారాగార శిక్షను ఖరారు చేస్తూ మిగిలిన వారిని విడుదల చేసింది ధర్మాసనం. కార్మిక సంఘం నాయకుడి హత్య కేసులో రాష్ట్ర పోలీసులు, సీబీఐ కలిసి దర్యాప్తు చేయడం దేశ చరిత్రలో మొట్టమొదటి కేసుగా నిలిచిపోయింది. నియోగి కేసుకు ముందు సింగరేణి నల్ల నేల మందమర్రిలో జరిగిన కార్మిక గుండెచప్పుడు వీటి అబ్రహం హత్య కేసు సైతం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది, అనంతరం తమ ఉనికి చాటుకొనే లక్ష్యంతో పీపుల్స్ వార్ వంటి గ్రూపులు రాధాకృష్ణ, నర్సయ్య వంటి పలువురు కార్మిక సంఘం నాయకులను హత్యలు చేసి కోల్ బెల్ట్ లో భయానక వాతావరణాన్ని సృష్టించాయి. ఛత్రీస్ గఢ్ ముక్తి మార్చ్ తో అసంఘటిత కార్మికులను సంఘటిత పరిచి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అసువులు బాసిన కార్మిక నాయకులుతో కార్మికులు, శ్రామికుల కోసం ప్రాణాలను



త్యాగం చేసిన వారు కార్మికల గుండెల్లో చిరస్థాయిగా పదిలంగా ఉంటారు.

**(నేడు శంకర్ గుహ నియోగి వర్ధంతి)**

**రివాల్యూషన్ సంస్థ వ్యవస్థాపకుడు..**
**అనిల్ భగత్, జర్నలిస్ట్.**
**94917 43506**

# భగత్ సింగ్ వారసులెవరు?..

## విప్లవం అంటే బాంబులు తుపాకులు కాదు...


## జర్నలిజంలో భగత్ సింగ్..

షహిద్ భగత్ సింగ్ ఆ పేరు స్మరిస్తేనే భారతీయులందరి హృదయాలు ఉత్తేజితమవుతాయి. ఆయన గురించి మాట్లాడుకుంటే తెలియకుండానే పిడికిళ్ళు బిగుసుకుంటాయి. ఉరికొయ్యను ముదాడిన వీరులు అన్న భావన భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురుల రూపంలో మనకు సాక్షాత్కరిస్తుంది. 1907 సెప్టెంబర్ 28న పంజాబ్ రాష్ట్రంలోని బంగా ప్రాంతంలో విరమాత విద్యావతి, తండ్రి కిషన్ సింగ్ లకు భగత్ సింగ్ జన్మించారు.(ఆ ప్రాంతం నేడు పాక్ దేశంలో ఉంది). పదేళ్ల వయస్సులోనే భగత్ ను దేశానికి అంకితం చేస్తానని తాత అర్జున్ సింగ్ బంధు మిత్రుల నడుమ సంప్రదాయ కార్యక్రమంలో ప్రకటన చేశారు. భగత్ సింగ్ చిన్నాన్న అజిత్ సింగ్ స్వాతంత్ర్య పోరాటంలో జైల్ పాలయ్యారు. బాల్యం నుంచే భగత్ సింగ్ బ్రిటిష్ ప్రభుత్వ అణచివేతను చూస్తూ అనుభవిస్తూ పెరిగారు. జలియన్వాలాబాగ్ నరమేధంతో ఆంగ్లేయుల పై ప్రతీకారం తీర్చుకుందామని చిన్న వయసులోనే ప్రతిజ్ఞ బూనారు. మాతృదేశ విముక్తి అనే ఉన్నత ఆశయానికి అంకితం అవుతూ కుటుంబ సుఖాలు, వాంఛలకు అవకాశం లేకుండా ఇల్లు వదలి ఢిల్లీకి వెళ్లి యువకులు, విద్యార్థులతో కలిసి భగత్, భగవతీచరణ్ ఇద్దరే నౌ జవాన్ భారత్ సభను స్థాపించి భగత్ కార్యదర్శిగా ఉంటూ ఆగ్రా, అమృతసర్, లాహోర్, లక్నో లలో ముఖ్య కేంద్రాలును ఏర్పాటు చేసుకున్నారు. అర్జున్, ప్రతాప్, కీర్తి వంటి పత్రికలలో భగత్ సింగ్ పని చేస్తూ పలు సంపాదకీయాలు అందించారు, పలువురు జర్నలిస్టుల వార్త కథనాలకు వివరణను ఇచ్చారు..

### హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్ లో చేరిక...

గదర్ పార్టీలో అత్యంత చురుకైన సభ్యులలో ఒకరైన కర్తార్ సింగ్ సరభాను 19 ఏళ్ల వయస్సులో 1915లో ఆంగ్ల ప్రభుత్వం ఉరి తీసింది. హెచ్.ఆర్.ఏ సంస్థ ఏర్పాటు దాని మనుగడ ఆయుధాలను సమకూర్చుకోవడం కోసం 1920లో కాకోరి కుగ్రామం వద్ద రైలు దోపిడీ చేసి ప్రభుత్వ నగదును దోచుకున్న సంఘటన జరిగింది. ఈ కుట్ర కేసులో అశ్వకుల్లా ఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్, రోషన్ సింగ్, రాజేంద్ర లాహిరిలను ఉరి తీయగా, నలుగురికి యావజ్జీవ శిక్ష ఖరారు కాగా అండమాన్ జైలుకు తరలించారు, మరో 17 మందికి యావజ్జీవ శిక్ష విధించగా వారిలో చంద్ర శేఖర్ ఆజాద్ మాత్రం తప్పించుకున్నారు. భగత్ సింగ్ హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్ సంస్థలో చేరి కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ తమ ఆదర్శ త్యాగమూర్తి కర్తార్ సింగ్ పేరిట సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్ సంతకం చేసిన కరపత్రాలను మిత్రులతో కలిసి పంచిపెడుతూ ప్రజలను చైతన్య పరిచారు. కరపత్రాల్లో రైతులు, కార్మికులు, శ్రామికులు, వెట్టిచాకిరి, ఆంగ్లేయుల దోపిడీలు, భారతీయ తొత్తుల గురించి క్లుప్తంగా వివరించారు. షేర్ ఇ పంజాబ్ అని అందరూ గౌరవంగా పిలుచుకునే లాలా లజపతి రాయ్ సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా లాహోర్ లో చేస్తున్న శాంతియుత ప్రదర్శన పై లాఠీ ఛార్జ్ చేసి వృద్ధుడు లాలా మరణానికి కారకులైన సాండర్స్ను ప్రతీకారంగా రెండు నెలల






వ్యవధిలో ఆజాద్, రాజ్ గురు, భగత్ సింగ్ లు హత్య చేశారు. అక్కడి నుండి పారిపోతుండగా వెంబడించిన భారతీయ కానిస్టేబుల్ చిన్నన్ సింగ్ ను చంద్ర శేఖర్ ఆజాద్ పొరపాటున కాల్చి చంపి ముగ్గురు అంతకుముందే దొంగిలించిన సైకిల పై తప్పించుకున్నారు. ఈ హత్య కేసులతో పాటుగా పలు కుట్రలకు పాలుపడినట్లు, బాంబుల తయారీ కేంద్రాలకు సంబంధించి వివిధ కేసులు హెచ్.ఎస్.ఆర్.ఎ సభ్యుల పై నమోదయ్యాయి. లాలా లజిపతి రాయ్ మరణానికి కారణమైన సాండర్స్ను హత్య చేసి పారిపోతుండగా అడ్డు వచ్చిన భారతీయ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తమ చేతిలో హత్యకు కావడం పట్ల చింతిస్తూ గోడ పత్రలను అంటించారు. రహస్య జీవితం గడుపుతు కలకత్తా, ముంబై, నాసిక్, రత్నగిరి, లక్నో ఇలా వివిధ ప్రాంతాల్లోని విప్లవకారులను కలుస్తూ వారి వద్ద సమాచారం పంచుకుంటూ భవిష్యత్ ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు.

### పార్లమెంటులో బాంబులు..

పార్లమెంటులో పారిశ్రామిక, ప్రజాభద్రత, వంటి కఠినమైన చట్టాలను ఆంగ్ల ప్రభుత్వం ప్రవేశపెటుతున్న నేపథ్యంలో ప్రభుత్వ నిరంకుశ విధానాలకు నిరసనగా భగత్ సింగ్, భటుకేశ్వర్ దత్ లు పార్లమెంటులో బాంబులను విసిరారు. తమ విప్లవ ప్రచారానికి న్యాయస్థానాన్ని వేదికగా ఉపయోగించు కోవాలని నిర్ణయించుకుని పారిపోయి అవకాశాలు ఉన్న అక్కడే ఉండి అరెస్టయ్యారు. అనంతరం న్యాయస్థానంలో అసెంబ్లీ బాంబు కేసులో భగత్ సింగ్ ఇలా వ్యాఖ్యానించారు. విప్లవం అంటే అన్ని సందర్భాల్లోనూ రక్తంతో తడిసిముద్దయ్యే పోరాటాలే కానక్కరలేదు. అది బాంబులు, తుపాకులు మాత్రం కాదు, అన్యాయం, అసమానత్వం ఆధారంగా ఏర్పడిన ప్రస్తుత సామాజిక విధానాలో మార్పు తేవడమే విప్లవం. విప్లవం అంటే హింసకూ, తీవ్రవాదానికీ సమానమైనది కాదు, దాని తొలి లక్ష్యం దేశానికి స్వేచ్ఛ వాయువులు ప్రసాదించడం, సామ్రాజ్యవాదాన్ని కూలదోయడం. మనిషి మనిషిని దోచుకునే స్థితిని అంతం చేయడం. విప్లవాన్ని రాజకీయ, ఆర్థిక దోపిడీకి ఏమాత్రం సాధ్యంకాని ఒక నూతన సామాజిక కార్యక్రమాన్ని ఆవిష్కరించడానికి ఉద్దేశించిన సామాజిక, రాజకీయ, ఆర్థిక, స్వాతంత్ర్య అంశంగా గుర్తించాలి. బాంబుల తయారీ విధానం గురించి వివరించే క్రమంలో అక్కడ ఉన్న జర్నలిస్టులు వార్త స్వీకరించి ప్రచురించడంతో దేశంలో అనేకమందికి బాంబుల తయారీ శిక్షణను అందించినట్లు అయింది.

### విప్లవం వర్ధిల్లాలి..

కేసుల విచారణలో జైలు శిక్ష అనుభవిస్తూ ఖైదీల హక్కులకై నిరాహారదీక్షలు చేస్తున్న క్రమంలోనే దేశవ్యాప్తంగా ప్రజలు భగత్ సింగ్ కు సంగీభవ కార్యక్రమాలను చేపట్టి మద్దతు ప్రకటించారు. భగత్ సింగ్ ఓ లేఖలో ఇలా రాసారు నీరసమైన స్ఫూర్తి స్థానంలో విప్లవ స్ఫూర్తిని నింపాలి లేదంటే దిగజారిన విప్లవాల విలువలదే పై చేయి అవుతుంది. తిరోగమన వాదుల వల్ల మొత్తం మానవ జాతే దారి తప్పుతుంది. ఆ స్థితిలో మనిషి పురోగతి స్తంభించిపోతుంది. ప్రజల్లో ఎప్పటికీ విప్లవ స్ఫూర్తి వ్యాప్తి చెందుతూ ఉండాలి. దానివల్ల తిరోగమన శక్తులు బలపడటానికి అవకాశముండదు. పురోగతికి ఏర్పడే ఆటంకాలను నిరంతరం తొలగిస్తుండాలి. పాత వ్యవస్థ ఎప్పుడూ మార్పు చెందుతూ నూతనత్వానికి అవకాశం ఇవ్వాలి. ఆ విధంగా ప్రపంచాన్ని చెడగొట్టకుండా ఒక మంచి వ్యవస్థ అడ్డుపడుతుంది. ఈ ఆశయంతోనే మేము ఇంక్విలాబ్ జిందాబాద్ (విప్లవం వర్ధిల్లాలి) అని గొంతెత్తి నినదిస్తుంటాం అని ఉరితాడును ముదాడినారు. రాజకీయ అధికారం కోసం నక్సలైట్లు దేశ భక్తులతో పోల్చుతూ ఓటర్ల సానుభూతి పొంది అధికారంలోకి వచ్చిన పాలకులు మావోయిస్టులు ఇరువురు కలిసి ప్రజల యోగక్షేమాలు మరచిపోతున్నారు. భవిత భవిష్యత్ అంధకారం చేస్తు ప్రజల ఆత్మబలిదానాల మీద అవకాశవాద ప్రకటనలు చేసేవారే నేడు భగత్ సింగ్ వారసులుగా ప్రకటించుకోవడం త్యాగమూర్తుల త్యాగాలను తాకట్టు పెట్టడం తప్ప మరొకటి కాదు.

**జర్నలిస్ట్**
**అనిల్ భగత్**
**రివేల్యూషన్ సంస్థ**
**9491743506**

Printed, Published and Owned by GUNTOJU VISHNUMURTHY, Printed at V.M PRINTERS Plot.no.108, shivashakar colony, kuntloor (vill) Abdullapurmet(md) Dist. Rangareddy Telangana, Published at V.M PUBLCATIONS Plot.no.108, shivashakar colony, kuntloor (vill) Abdullapurmet(md), Dist.Rangareddy, Telangana state pin : 501505. Editor : GUNTOJU VISHNUMURTHY, RNI NO. APTEL/31957/2009, cell no.9676549223